సాక్షి
మెదక్
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



సౌర వెలుగులు
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. వివరాలు 8లో ▸

వాహనదారుల అత్యుత్సాహం
వాహనదారుల అత్యుత్సాహమే చిరుత ప్రాణాల మీదకు తెచ్చిందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు 8లో ▸





దరఖాస్తుల వెల్లువ
రైతు వేదికలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల శిబిరంలో దరఖాస్తులు అధికంగా వచ్చాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన సునీతారెడ్డి



మాజీ సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శుక్రవారం ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను ఆయనకు వివరించారు. ఈసందర్భంగా కేసీఆర్ పలు సూచనలు చేశారని ఆమె తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలుస్తామని అడుగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఫిబ్రవరిలో కలిసేందుకు సమయం ఇస్తానని చెప్పారని సునీతారెడ్డి వివరించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మండలం మంబోజిపల్లి, మాచవరం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, మెదక్ రూరల్ ఏఈ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎస్ఎఫ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను ఆర్డీఓ రమాదేవి శుక్రవారం పరిశీలించారు. దివ్యాంగులకు కల్పించాల్సిన వసతుల గురించి తహసీల్దార్ సింధూ రేణుకను అడిగి తెలుసుకున్నారు. ఓటు వేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

ఆడపిల్లలు చదువులో రాణించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సంతోషి

నర్సాపూర్ రూరల్: ఆడపిల్లలు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ సంతోషి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చిప్పల్‌తుర్తి కేజీబీవీలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బేటి బచావో- బేటి పడావో' దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరిగితే 1098 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ సోషల్ వర్కర్ సరిత, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెదక్ డీఎస్పీకి రెండు పతకాలు



పతకాలు అందుకుంటున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ మున్సిపాలిటీ: కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్, సింగిల్స్ పోటీల్లో పాల్గొని కాంస్యం, వెండి పతకాలు గెలుచుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆయనను అభినందించారు.

సీతమ్మ.. కరుణించేనా!



చేగుంట వద్ద రైల్వేగేటు పడడంతో నిలిచిన వాహనాలు

మెదక్‌జోన్: కేంద్ర బడ్జెట్‌పై మెతుకుసీమ వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఏటా ఆశించిన రీతిలో నిధుల కేటాయింపులు, రైల్వే ప్రాజెక్టులు రావడం లేదు. నూతన విద్యాలయాలు, గోదాంల నిర్మాణాలకు మోక్షం కలగడం లేదు. జిల్లాలో చారిత్రాత్మక ప్రదేశాలు ఉన్నా టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడం లేదు. ఎంపీ రఘునందన్‌రావు మెదక్‌కు నూతన ప్రాజెక్టులు, నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశ పెట్టనుండగా... కేటాయింపులపై వివిధ వర్గాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైల్వేగేటు దాటని కష్టాలు

జిల్లా నుంచి అధిక శాతం ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే వయా తూప్రాన్ మీదుగా వెళ్తుంటారు. చేగుంట రైల్వే గేటు పడిందంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రైల్వే మార్గం మీదుగా ముంబాయి- సికింద్రాబాద్, అజంతా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సాధారణ రైళ్లు సైతం అరగంట కొకటి చొప్పున తిరుగుతూనే ఉంటాయి. దీంతో రైలు వచ్చిన ప్రతిసారి గేటు మూసి వేయడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కాగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతీసారి రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్వోబీ)కి నిధులు

| నేడే కేంద్ర బడ్జెట్ |

మంజూరు అవుతాయా అని ఈ ప్రాంత ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తుంటారు.

గోదాంలు లేక ఇబ్బందులు

మెదక్ రైల్వేస్టేషన్ వద్ద గతంలో రేక్‌పాయింట్ నిర్మించారు. స్టేషన్ సమీపంలో గోదాంలు నిర్మిస్తామని పాలకులు హామీలు గుప్పించారు. కానీ అదిశగా నేటికీ అడుగులు పడటం లేదు. ఫలితంగా సరుకుల దిగుమతి, ఎగుమతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే మెదక్ నుంచి ముంబాయి, తిరుపతి లాంటి ప్రాంతాలకు కొత్తగా రైళ్లను నడపాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఇక్కడ పండించిన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలను తరలించేందుకు నూతనంగా మెదక్ నుంచి మీర్జాపల్లి వరకు నూతనంగా రైల్వే లైన్ వేయాలని వేడుకుంటున్నారు.

ఎన్నెన్నో ఆశలు...

- మెదక్‌లో విద్యాలయాలు కరువయ్యాయి. ఉన్నత చదువులకు విద్యార్థులు హైదరాబాద్ లాంటి నగరాలకు పరుగు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.
- కాకతీయుల ఏలుబడిలో నిర్మించిన ఖిల్లా.. ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ చర్చి, పోచారం అభయారణ్యం, దాని పక్కనే పోచారం ప్రాజెక్టు ఉంది. ప్రసిద్ధి చెందిన ఏడుపాయల పుణ్యక్షేత్రం తదితర ప్రాంతాలను కలిపి పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.
- మెదక్- బాలానగర్ హైవేలో భాగంగా నర్సాపూర్ నుంచి గుమ్మడిదల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే ప్రయాణం సాఫీగా సాగే అవకాశం ఉంది.
- మిర్జాపల్లి, అక్కన్నపేటలో అజంతా, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వడియారంలో రాయలసీమ, దేవగిరితో పాటు మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతున్నారు.
- మరో వైపు మనోహరాబాద్ నుంచి సిద్దిపేటకు రైల్వేలైన్ పూర్తి కావడంతో రైలు నడుపుతున్న అధికారులు, సిద్దిపేట నుంచి పెద్దపల్లి వరకు రైల్వేలైన్ విస్తరించాలనే డిమాండ్ ఉంది.



వందశాతం నిధులు తెస్తా..



"చేగుంట రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరవుతాయని ఆశిస్తున్నాను. ఇందుకోసం కేంద్రం నుంచి వందశాతం నిధులు తెస్తా. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిని 50 శాతం నిధులు ఇవ్వాలని కోరితే ఇవ్వలేమని చెప్పారు. అలాగే కేంద్రీయ విద్యాలయంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా."
– రఘునందన్‌రావు, ఎంపీ

బీఆర్‌ఎస్‌లో ఫుల్ జోష్

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో పాదయాత్ర జోష్ నింపింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో పార్టీ అధినేత కేసీఆర్‌ను నేరుగా కలుసుకోవడంతో కార్యకర్తలు ఉబ్బితబ్బిబవుతున్నారు. కేసీఆర్ ప్రసంగం శ్రేణులను కార్యోన్ముఖులుగా చేయడమే కాకుండా.. వారిలో ఉత్సాహం నింపింది.

కార్యకర్తలను కార్యోన్ముఖులు చేసిన కేసీఆర్
- తెలంగాణ ఉద్యమానికి జహీరాబాద్ ప్రాంతమే స్ఫూర్తి
- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు ఎందుకు ఆపారో చెప్పాలి
- అవసరమైతే ఉద్యమించి సాధించి పెడతా..
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో శ్రేణులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

జహీరాబాద్: ఝరాసంగం మండలం మేదపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు చేరుకుంది. జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌ల సారథ్యంలో జనవరి 27న పరమేశ్వర్‌పాటిల్ కేసీఆర్‌ను కలిసేందుకు పాదయాత్ర చేపట్టారు. నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మాజీ జడ్పీటీసీలు స్వప్న, ఆర్.ప్రవంతిరెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు నారాయణ, వెంకటేశం, నర్సింహులు, సంజీవరెడ్డి, భాస్కర్, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌లు పాల్గొన్నారు.

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు సాధిస్తా
జహీరాబాద్ నియోజకవర్గానికి సంగమేశ్వర, నారాయణఖేడ్ నియోజకవర్గానికి బసవేశ్వర ప్రాజెక్టుల ద్వారా సాగు నీటిని అందించేందుకు వీలుగా ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేసినట్లు కేసీఆర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే లక్షలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా ప్రాజెక్టులను మరుగున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రాజెక్టుల నిర్మాణం పనులు ప్రారంభించాలని, వెంటనే టెండర్లు పిలవాలన్నారు. లేకుంటే మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఉద్యమంలో తాను ముందుండి నడిపిస్తానన్నారు. ఆయా ప్రాజెక్టులను ఎందుకు ఆపారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

జహీరాబాద్ ప్రాంతమే ఉద్యమానికి స్ఫూర్తి
తాను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని చేపట్టడానికి జహీరాబాద్ ప్రాంతం కూడా స్ఫూర్తి అయిందని కేసీఆర్ పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి వ్యవసాయం చేయాలనుకున్నాని చెప్పారు. అయితే.. రాజులు, చౌదరిలకు సంబంధించిన భూములు వందలాది ఎకరాల్లో ఉన్నట్లు గమనించానని, తెలంగాణ రాకుంటే రైతుల చేతుల్లో నుంచి మొత్తం భూములు పోయే పరిస్థితిని గుర్తించానని, ఉద్యమానికి ఇది కూడా స్ఫూర్తి అయిందని కేసీఆర్ వివరించారు.

122 మంది బాలలకు విముక్తి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 122 మంది బాలలకు వెట్టి నుంచి విముక్తి కల్పించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా 122 మంది పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చామని వివరించారు. ఇతర రాష్ట్రాల పిల్లలను వారి తల్లితండ్రులు వచ్చే వరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే సంరక్షణ కేంద్రాల్లో ఉంచుతామన్నారు. బాలల పరిరక్షణ విభాగం, పోలీస్, లేబర్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించిందని పేర్కొన్నారు.

పశువులకు నాటు వైద్యం చేయొద్దు



రైతులకు మందులు అందజేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య

శివ్వంపేట(నర్సాపూర్): పశువులు అనారోగ్యానికి గురైతే నాటు వైద్యం చేయకూడదని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య రైతులకు సూచించారు. మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంతతి పెంపొందించేందుకు రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ డివిజన్ పశు వైద్యాధికారి జనార్దన్, పశు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా సరికాదు'

మెదక్ కలెక్టరేట్: చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా విధింపు చర్యలు మానుకోవాలని టీజీ యూఈఈయూ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చండీగఢ్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 50 రోజులుగా విద్యుత్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులపై అణచివేత చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయ వేళలు మార్చండి



గ్రంథాలయ ఆవరణలో చదువుకుంటున్న అభ్యర్థులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా గ్రంథాలయ వేళలు ఇబ్బందిగా మారాయని, వాటిని మార్చాలని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోరారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకే గ్రంథాలయానికి తాళం వేయడంతో గత్యంతరం లేక ఆవరణలోనే కూర్చొని చదువుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవని, ఈ ప్రభుత్వం ఇస్తుండడంతో చదువుకుందామంటే అవకాశం లేకుండా పోతుందని వాపోయారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బ్యాతోల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. పాఠాలు బోధించి పలు ప్రశ్నలు అడిగారు. వారు అందుకు బదులివ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అంగన్‌వాడీల్లో చదివే చిన్నారులను తమ సొంత పిల్లలుగా భావించి వారికి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు మంచి ఆహారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి డంప్‌యార్డులకు తరలించాలని ఆదేశించారు.

ఉపాధిలో అవకతవకలు సహించం

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్



ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తున్న శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): ఉద్యోగులు, మైనర్లతో ఉపాధి పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. రామాయంపేటలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో పలు అవకతవకలు చోటు చేసుకున్నట్లు అడిట్‌లో తేలిందన్నారు. వారికి జరిమానా విధించడంతో పాటు డబ్బులు రికవరీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు, ఒకరి పేరుపై మరొకరు పనులు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు రూ. 72,517 రికవరీ చేశామని, రూ. 15,082 జరిమానా విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి శ్రీహరి, ఎంపీడీఓ సజీలుద్దీన్, ఏపీఓ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

డీఈఓ రాధాకిషన్



మొబైల్ వాహనంలో కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్/చేగుంట(తూప్రాన్): విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. శుక్రవారం 'కలాం స్ఫూర్తి యాత్ర' చేరుకోగా.. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కలాం స్ఫూర్తి యాత్ర విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుతుందని అన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ.. రోబోటిక్స్, ఏఐ, డ్రోన్ల పనితనం, త్రీడీ బొమ్మలు వంటి వివిధ అంశాలను మొబైల్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అందించడం ఉపయోగకరమన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో డీఈఓ సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆపార్ ఐడీ చేయించాలని ఆదేశించారు. అలాగే చేగుంట మండలంలోని చందాయిపేట జెడ్పీ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించగా.. డీఈఓ ఓటు వినియోగించుకుని మాట్లాడారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎంఈఓ సత్యనారాయణ
- ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు
- విజేతగా నిలిచిన నిజామాబాద్ జట్టు



బహుమతి అందుకుంటున్న నిజామాబాద్ బాలికల జట్టు

తూప్రాన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మండల విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాల, బాలికల క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణించడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వం అన్ని విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. క్రీడాకారులు మంచి నైపుణ్యాలను సాధించడానికి ప్రణాళికతో కూడిన శిక్షణ తీసుకోవాలని సూచించారు.

ఫైనల్‌లో హోరాహోరీ
మెదక్, నిజామాబాద్ బాలుర జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇరు జట్ల మధ్య మూడు పర్యాయాలు జరిగిన మ్యాచ్‌లలో రెండు జట్లు సమాన స్కోర్ సాధించి బరిలో నిలవడం, ఫలితం తెలకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. చివరగా జరిగిన మ్యాచ్‌లో నిజామాబాద్ 6, మెదక్ 5 పాయింట్లు సాధించాయి. నిజామాబాద్ జట్టు ప్రథమ స్థానం, మెదక్ జట్టు ద్వితీయ, ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయ, ఆదిలాబాద్ తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కో ఆర్డినేటర్ శ్యాంసుందర్‌శర్మ, గోవర్ధన్, రాష్ట్ర పరిశీలకులు గంగ మోహన్, రవి కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


జిల్లాలో నేటి నుంచి పోలీస్ యాక్ట్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని శనివారం నుంచి జిల్లావ్యాప్తం పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే ప్రజాధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈనెల 28 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు.

బోటు లేదాయే.. షికారు కరువాయే


సంగారెడ్డి జిల్లా మంజీరా డ్యామ్‌ గేట్ల వద్ద వృథాగా ఉన్న బోట్లు


మహబూబ్‌ సాగర్‌ చెరువులో బోట్లు ఎక్కే స్థలం వద్ద గుర్రపు డెక్క


పాడైన బోట్లు

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మంజీరా డ్యామ్‌లో పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో గతంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బోట్లు ఏర్పాటు చేశారు. కానీ కొద్ది రోజుల తర్వాత సరైన పర్యవేక్షణ లేక బోట్లు మూలకు పడ్డాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది. ఎంతో జీవ వైవిధ్యం ఉన్న మంజీరా ప్రాంతానికి వేసవిలో విదేశీ పక్షులు వస్తాయి. వాటిని చూడటానికి సంగారెడ్డి చుట్టు పక్కల జనంతోపాటు హైదరాబాద్, బీదర్‌ నుంచి సైతం పర్యాటకులు వస్తారు. కానీ బోట్లు అందుబాటులో లేక తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అలాగే, సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్‌ చెరువులో సైతం ఏర్పాటు చేసిన బోటు వినియోగంలో లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని సంగారెడ్డి వాసులకు బోటు భాగ్యం కలిగించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పెంపు

సిద్దిపేటరూరల్‌: దివ్యాంగుల ఉపాధి పునరావాస పథకం దరఖాస్తు గడువును 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీ కాంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా అర్హులైన 30 మందికి ఈ పథకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా వందశాతం సబ్సిడీతో ఒక్కో యూనిట్‌కు రూ.50 వేల చొప్పున 30 యూనిట్లు అందించేందుకు గాను ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు http://tgobmms.cgg.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీస వయస్సు 21 నుంచి 55 ఏళ్లు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.లక్షన్నర, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల వరకు ఆదాయ పరిమితి ఉన్నవారు అర్హులని, ఐదేళ్లలో ప్రభుత్వ సంస్థ నుంచి ఎలాంటి సబ్సిడీ పొంది ఉండరాదని సూచించారు.

ఉద్యోగ విరమణ పొందిన నెల రోజుల్లోనే పెన్షన్‌ పత్రాలు


పెన్షన్‌ చెల్లింపు అందజేస్తున్న శ్రీదేవి

పటాన్‌చెరు టౌన్‌: ఉద్యోగ విరమణ పొందిన నెలలోనే పెన్షన్‌ ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్‌ ఫండ్‌ కమిషనర్‌–2 శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన చందాదారులకు పెన్షన్‌ చెల్లింపు ఆర్డర్‌ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. జనవరి నెలలో ఉద్యోగ విరమణ పొందిన 42 మంది చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో 25 మందికి అందజేశామన్నారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అసిస్టెంట్‌ పీఎఫ్‌ కమిషనర్‌ దిలీప్, అకౌంట్స్‌ ఆఫీసర్‌ అబ్దుల్‌ అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడుచుకోవాలి

శ్రీరామానుజ చినజీయర్‌ స్వామి


ప్రవచనాలు చేస్తున్న చినజీయర్‌స్వామి

రామాయంపేట(మెదక్‌): మహిళలు సంఘటితమై ధర్మాన్ని ఆచరిస్తే సమాజానికి నిజమైన రక్షగా ఉంటుందని చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న పుష్కర బ్రహ్మోత్సవాలు కార్యక్రమానికి హాజరై భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి మనిషిలో దేవుడున్నాడని, మనం సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఆలయాలను ప్రధాన కేంద్రంగా చేసుకొని ఆధ్యాత్మికంగా విరసిల్లేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతీ ఇల్లు దేవాలయాలుగా మారాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్నారు.

కాలు తీసేశారు

గోవర్ధనగిరి ప్రమాదంలో గాయాలపాలైన స్వరూప


చికిత్స పొందుతున్న స్వరూప

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అయ్యో పాపం.. చికిత్స తర్వాత ఎప్పటిలాగే ఇంటికి తిరిగొస్తుందన్న ఆ ఉపాధి హామీ కూలీ కుటుంబం గంపెడాశ కాస్త నిరాశలో ముంచేసింది. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో గురువారం ఉపాధి హామీ పని ప్రదేశంలో బండరాళ్లు మీద పడి తల్లీకూతురు మృతి చెందగా, పలువురికి గాయాలైన విషయ తెలిసిందే. ఇందులో ఇంద్రాల స్వరూప కాలు నుజ్జునుజ్జయ్యింది. వరంగల్‌ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఆమె కాలును శుక్రవారం వైద్యులు తీసేశారు. ఎంపీడీఓ భానోతు జయరాం, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్‌తోపాటు పలువురు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు.

మహిళా సంఘాల్లో సౌర వెలుగులు

సోలార్‌ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు

- ఒక్కో మెగా వాట్‌ ఉత్పత్తికి 4 నుంచి 5 ఎకరాలు
- జిల్లాలో ఇప్పటికే 105 ఎకరాలు గుర్తింపు
- ఇందిరమ్మ మహిళా శక్తితో ఉపాధి అవకాశాలు
- సంఘాలకు బ్యాంకు రుణాలు


నారాయణఖేడ్‌ మండలం పంచేగం గ్రామంలో స్థలం పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్‌: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఇందులో భాగంగా 17 రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. సౌర శక్తి విద్యుత్‌ ప్లాంట్లను ఏర్పాటు చేసి విద్యుత్‌ ఉత్పత్తి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారు. ఇందుకు గాను వినియోగంలో లేని ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలిస్తున్నారు.

గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు వివిధ రకాల ఉపాధి అవకాశాలు లభించే విధంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలను అందిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సౌర శక్తి వినియోగం ప్రోత్సహించడానికి పీఎం కుసుమ్‌ పథకం ప్రారంభించారు. ఈ పథకాన్ని ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని నిర్ణయించుకుంది. వినియోగంలో లేని ప్రభుత్వ, అటవీ భూమి, దేవాదాయ, బంజర భూములు, ప్రైవేట్ , లీజు భూములు ఒప్పందాలతో సౌర శక్తి విద్యుత్‌ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భూములను సేకరిస్తున్నారు.

1,91,465 మంది సభ్యులు

జిల్లాలో 105 ఎకరాలు గుర్తించి సౌర విద్యుత్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక మెగావాట్‌ విద్యుత్‌ ఉత్పత్తికి నాలుగు నుంచి ఐదు ఎకరాల భూమి కావాలని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికి 18 మండలాల్లో 105 ఎకరాల భూమిని గుర్తించారు. మొత్తం 18,465 మహిళా సంఘాలు ఉండగా 1,91,465 మంది సభ్యులు ఉన్నారు. గ్రామ సమాఖ్యలు 695, మండల సమాఖ్యలు 25 ఉన్నాయి. మహిళలకు ముందుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారు.

రూ.3 నుంచి రూ.3.50 కోట్లు

సోలార్‌ ప్లాంట్ల ఏర్పాటుకు భారీగా నిధులు అవసరం. ఒక్కో మెగా వాట్‌ ఉత్పత్తికి సుమారు రూ.3 నుంచి 3.50 కోట్ల వరకు అవసరం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతోపాటు మహిళా సంఘాలకు 10 శాతం డబ్బును గ్రామ సమాఖ్య లేదా మండల సమాఖ్యల నుంచి చెల్లించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. సోలార్‌ ప్లాంట్‌ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ యూనిట్‌కు రూ.3.13 చొప్పున కొనుగోలు చేయనున్నారు.

జీవనోపాధి పొందుతాం



గ్రామంలో సోలార్‌ ప్లాంట్‌ ఏర్పడితే జీవనోపాధి పొందుతాం. ప్రభుత్వం ఏర్పాటు చేసే సోలార్‌ కోసం గ్రామంలోని బీడు భూమిని నాలుగు ఎకరాలు అధికారులు చూశారు. అధికారులే శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాం అంటున్నాం. మహిళా సంఘాల్లో ఉన్న వారందికీ ఇది ఉపయోగపడుతుంది.

– భాగ్యమ్మ, మాచిరెడ్డిపల్లి గ్రామం, కోహీర్‌ మండలం

ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నాం



మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సౌర విద్యుత్‌ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్‌ ఆదేశాల మేరకు మహిళా సంఘం సభ్యులకు ఉపాధి పొందే విధంగా సౌర విద్యుత్‌ ప్లాంట్లను ఏర్పాటు చేస్తాం.

– జంగారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి

ఒక్కో మెగావాట్‌ సామర్థ్యం ఉన్న యూనిట్‌ నుంచి రోజుకి కనీసం 4 యూనిట్ల విద్యుత్‌ ఉత్పత్తి అవకాశం ఉంది. దీంతో మహిళా సంఘాలకు అన్ని విధాలుగా ఆదాయం చేకూరుతుంది. సౌర శక్తి విద్యుత్‌ ప్లాంట్ల ద్వారా ప్రతినెలా రూ.2,16,000 ఆదాయం సమకూరవచ్చు.

దేశాభివృద్ధికి సాంకేతికత తోడ్పడాలి

- కేరళ గవర్నర్‌ రాజేంద్ర విశ్వనాథ్‌ అర్లేకర్‌
- సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ సందర్శన


ఐఐటీని సందర్శిస్తున్న గవర్నర్‌ రాజేంద్ర విశ్వనాథ్, కలెక్టర్‌ క్రాంతి, డైరెక్టర్, తదితరులు

సంగారెడ్డి జోన్‌: దేశాభివృద్ధికి ఆధునిక సాంకేతికత తోడ్పడాలని కేరళ రాష్ట్ర గవర్నర్‌ రాజేంద్ర విశ్వనాథ్‌ అర్లేకర్‌ సూచించారు. శుక్రవారం కంది మండలంలోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ–హైదరాబాద్‌ (ఐఐటీ)ని ఆయన సందర్శించారు. కలెక్టర్‌ క్రాంతి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి ఐఐటీతో భాగస్వామ్య అవకాశాల గురించి కలెక్టర్‌ గవర్నర్‌కు వివరించారు. ఐఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ బీఎస్‌ మూర్తి నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వ రంగ అభివృద్ధి వంటి విషయాలు తెలియజేశారు. ఐఐటీ రీసెర్చ్‌ అండ్‌ ఇన్నోవేషన్‌ ల్యాబ్‌ లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్‌ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల గురించి వివరించారు. గవర్నర్‌ మాట్లాడుతూ.. భవిష్యత్‌ భారతదేశ నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్డీఓ రవీందర్‌ రెడ్డి, డీఎస్పీ సత్తయ్య గౌడ్, తహసీల్దార్‌ విజయలక్ష్మి, డీటీ మల్లయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో యోగా శిబిరం

పాల్గొన్న యోగా గురువు పరమార్థదేవ్‌


యోగాసనాలు వేస్తున్న పరమార్థదేవ్, విద్యార్థులు, ఐఐటీహెచ్‌ ఫ్యాకల్టీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రాణాయామం ద్వారా శరీరంలోని సాఫ్ట్‌వేర్‌ను రోగ రహితంగా, శక్తివంతంగా తయారు చేసుకోవడం సాధ్యమవుతుందని స్వామి రాందేవ్‌బాబా శిష్యుడు, యోగా గురువు పరమార్థదేవ్‌ అన్నారు. హైదరాబాద్‌ ఐఐటీలో శుక్రవారం ఒక రోజు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఐటీహెచ్‌ విద్యార్థుల్లో ఒత్తిడికి తగ్గించేందుకు ఈ యోగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరమార్థదేవ్‌ మాట్లాడుతూ.. ధ్యానం ద్వారా మనసును, బుద్ధిని శుద్ధి చేసుకోవచ్చన్నారు. యోగాతో విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకోవచ్చని నిరూపితమైందన్నారు. అనంతరం పరమార్థదేవ్‌ను ఐఐటీహెచ్‌ ప్రొఫెసర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ బీఎస్‌ మూర్తి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతప్రభాకర్, ఐఐటీహెచ్‌ ఫ్యాకల్టీ ప్రొఫెసర్‌ ప్రేమ్‌పాల్, హిమాన్షు జోషి, ప్రొఫెసర్‌ నిరంజన్, ఐఐటీహెచ్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు కూలీ మృతి


రాములు(ఫైల్‌)

కొడిపల్లి(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో రైతు కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కొడిపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. కొడిపల్లికి చెందిన మద్దెల రాములు(50) కొడిపల్లి శివారులో హైదరాబాద్‌కు చెందిన దామోదర్‌రెడ్డి పొలంలో పనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికొస్తున్నాడు. తిరిగి పొలం వద్దకు టీవీఎస్‌ మోపెడ్‌పై వెళ్తున్నాడు. కొడిపల్లి పీహెచ్‌సీ ఎదుట 765డి జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన బొలేరో గూడ్స్‌ వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాములును మెదక్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో కార్మికుడు..


ప్రభాకర్‌ (ఫైల్‌)

హత్నూర(సంగారెడ్డి): బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం సాదుల్లా నగర్‌ గ్రామానికి చెందిన కండపల్లి ప్రభాకర్(22) పటాన్‌ చెరు మండలం గణేశ్‌ గడ్డ సమీపంలోని గల ఓ ప్రైవేట్‌ పరిశ్రమలో విధులు ముగించుకొని బైక్‌పై సొంత గ్రామం సాదుల్లా నగర్‌కి వస్తున్నాడు. గుండ్ల మాచనూర్‌ గ్రామ శివారులో గల పరిశ్రమల వద్ద సంగారెడ్డి–దౌల్తాబాద్‌ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ప్రభాకర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


వెంకటరాంరెడ్డి (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నంగునూర్‌ మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన చల్లారం వెంకటరాంరెడ్డి (63) చెల్లెలును హైదరాబాద్‌ వెళ్లే బస్సును ఎక్కించేందుకు గురువారం కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్‌ రోడ్డు వద్దకు బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సిద్దిపేటకు వెళ్లేందుకు టర్న్‌ అవుతుండగా కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వెంకటరాంరెడ్డిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌ అర్జునపల్లి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలార్పుతున్న స్థానికులు

సిద్దిపేటఅర్బన్‌: విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన సిద్దిపేట అర్బన్‌ మండలం మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాకీ భిక్షపతి కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌ ఇంజన్‌కు సమాచారం ఇచ్చి మంటలార్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. ఫైరింజన్‌ వచ్చినప్పటికీ అప్పటికే మంటలు ఎక్కువగా వ్యాపించి ఇంట్లోని వస్తువులు, బట్టలు, బీరువా, రూ.లక్ష నగదు కాలిపోయాయి. సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య


రాజిరెడ్డి (ఫైల్‌)

మద్దూరు(హుస్నాబాద్‌): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నలుసాని రాజిరెడ్డి(45) కొన్నేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రుల్లో చూయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయిన సమయంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య మృతితో మనస్తాపానికి గురై..

ములుగు(గజ్వేల్‌): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు మండలం బహిలంపూర్‌ ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ కథనం మేరకు.. వర్గల్‌ మండలం మైలారం గ్రామానికి చెందిన కాశబోయిన భాను(22) భార్య మూడు నెలల కిందట ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి భాను మానసికంగా కుంగిపోతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై 26న బహిలంపూర్‌ ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కనకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉదయం ట్రాక్టర్, సాయంత్రం లారీ

ఒకే ప్రాంతంలో రెండు వాహనాలు బోల్తా


బోల్తా పడిన ట్రాక్టర్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఒకే స్టేజీ వద్ద ఉదయం ట్రాక్టర్, సాయంత్రం లారీ బోల్తా పడ్డాయి. ఈ విచిత్రకర ఘటన అక్కన్నపేట మండలం నందారం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట్‌ మండలం నుంచి సేవాలాల్‌ మహారాజ్‌తండా గ్రామానికి శుక్రవారం ఉదయం ఇటుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ నందారం స్టేజీ క్రాసింగ్‌ వద్ద బోల్తా పడింది. అనంతరం ఇదే ప్రాంతంలో సాయంత్రం కోదాడ నుంచి సిమెంట్‌ లోడ్‌తో నందారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వస్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనాల డ్రైవర్లకు స్వల్పగాయాలు అయ్యాయి. బోల్తా పడిన చోట మలుపు ప్రమాదకరంగా ఉండడంతో లోడ్‌తో వచ్చే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

మహిళను వేధించినందుకు మూడేళ్ల జైలు

- రూ.21,000 జరిమానా
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్‌ మున్సిపాలిటీ: ఓ మహిళను వెంటపడి వేధించిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నివాసం ఉండే మహిళ తన తండ్రితో కలిసి 2023 మార్చి 11వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుంది. అదే గ్రామానికి చెందిన జంగం చంద్రలింగం వీరిని అటకాయించి నానా దుర్భాషలాడారు. బాధితులు రామాయంపేట పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేశారు. శుక్రవారం మెదక్‌ జిల్లా ప్రధాన కోర్టుకు కేసు విచారణకు రాగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద చంద్రలింగంకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.21వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు విషయంలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వాహనదారుల అత్యుత్సాహం.. ఓ చిరుత ప్రాణం!

- గాయాలతో రోడ్డుపైనే చిరుత
- అలాగే వెళ్లిపోయిన వాహనదారులు
- విచారణ చేపట్టనున్నట్లు డీఎఫ్‌ఓ జోజు
- పోస్టుమార్టం అనంతరం పులికి దహన సంస్కారాలు


బైక్‌ను వెంటాడుతున్న చిరుతపులి


పోస్ట్‌మార్టం చేస్తున్న వెటర్నరీ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్‌): నార్సింగి మండలం వల్లూర్‌ జాతీయ రహదారిపై వాహనం ఢీకొని చిరుత మృతి చెందిన విషయంలో వాహనదారుల అత్యుత్సాహమే చిరుత ప్రాణాలమీదకు తెచ్చిందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గురువారం రాత్రి 7:30 గంటల సమయంలో వల్లూర్‌ నర్సరీ సమీపంలో చిరుత రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై రహదారిపై కదలలేని పరిస్థితిలో ఉండిపోయింది. ఇది గమనించి వాహనదారులు మాత్రం అధికారులు వచ్చే వరకు ఆగకుండా చిరుత రోడ్డుపై ఉండగానే వెళ్లిపోయారు. ఓ ద్విచక్ర వాహనదారుడు చిరుత పక్క నుంచే వెళ్లేందుకు ప్రయత్నించగా బైక్‌పైకి దూకబోయింది. ఇదే సమయంలో మరి కొన్ని వాహనాలు ముందుకు సాగాయి. ఓ ఆర్టీసీ బస్‌ ముందుకెళ్లకుండా చిరుత అడ్డం పడింది. రెండోసారి వాహనాలు ఢీకొట్టడంతోనే రక్త గాయం అయ్యిందని స్థానికులు చెబుతున్నారు. గాయమైన 30 నిమిషాల తర్వాతే చిరుత ప్రాణం విడిచిందని భావిస్తున్నారు.

పోస్ట్‌మార్టం, దహన సంస్కారాలు

వల్లూర్‌ నర్సరీలోని కార్యాలయంలో శుక్రవారం వెటర్నరీ అధికారులు పోస్ట్‌మార్టం నిర్వహించారు. రామాయంపేట వెటర్నరీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ తిరుపతి, పేట, మాసాయిపేట, ప్రగతి ధర్మారం వెటర్నరీ డాక్టర్లు గీతా మాలిక, కావ్య, శ్రీనివాస్‌ చిరుతపులి పోస్ట్‌మార్టంలో పాల్గొన్నారు. అనంతరం డీఎఫ్‌ఓ జోజు, రామాయంపేట రేంజ్‌ ఆఫీసర్‌ విద్యాసాగర్, నార్సింగి ఎస్‌ఐ అహ్మద్‌ మొహినొద్దీన్‌ సమక్షంలో దహన సంస్కారాలు చేశారు.

చెరువులో వ్యక్తి గల్లంతు


రాకేశ్‌

నర్సాపూర్‌ రూరల్‌: రాయరావు చెరువులో వ్యక్తి గల్లంతైన ఘటన నర్సాపూర్‌ పట్టణంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్‌ ఎస్సై లింగం, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నర్సాపూర్‌ పట్టణానికి చెందిన నూనె రాకేశ్‌ (30) గురువారం రాత్రి కుటుంబ కలహాల నేపథ్యంలో నర్సాపూర్‌ పట్టణంలోని రాయరావులో దూకాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అదే రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శుక్రవారం ఉదయం ఫైర్‌ సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి అయినా రాకేశ్‌ జాడ దొరకలేదు. శనివారం కూడా గాలింపు చేపడుతామని పోలీసులు, ఫైర్‌ సిబ్బంది తెలిపారు.